క్లుప్తంగా

క్రీస్తు మార్గం అనుసరణీయం



చిన్నారులతో కేక్ కట్ చేయిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు (మెట్రో): ఏసుక్రీస్తు అందించిన శాంతి, ప్రేమ, దయ, ఐకమత్యం సందేశాన్ని ప్రతి ఒక్కరు ఆచరించాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం సెమీ క్రిస్మస్, హై టీ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఎమ్మెల్యే బడేటి రాధ చంటి కేక్ కట్ చేసి క్రైస్తవులకు, చిన్నారులకు పంచి పెట్టారు. క్యాండిల్ వెలిగించి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. పలువురు చిన్నారులు శాంటాక్లాజ్ వేషధారణలతో అలరించారు. తొలుత రెవరండ్ వి.రతన్ రాజు, బిషప్ జాన్ రాజు, పాస్టర్లు విలియం, రంజిత్ క్రీస్తు జన్మ విశిష్టత, బోధనలు, క్రిస్మస్ పండుగ గురించి వివరించారు. పాస్టర్ జయరాజ్ బైబిలు పఠనం చేశారు. ప్రార్థనలు, గీతాలు ఆలపించారు. అధికారులకు ఆశీర్వచనాలు అందించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్



ఆర్‌సీఈలో కేక్ కట్ చేస్తున్న ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : స్థానిక రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం సెమీ క్రిస్మస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రెయిజ్ మినిస్ట్రీస్ పాస్టర్ సునీల్ ప్రేమ్ క్రిస్మస్ వర్తమానం అందించారు. కేకట్ కట్ చేసి కళాశాల సిబ్బంది, విద్యార్థులకు కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ రోహిత్ సాయి శుభాకాంక్షలు తెలిపారు. కళాశాల డైరెక్టర్ ఎం మురళీధరరావు, డీన్‌లు ఎస్ఎస్ శర్మ, బి.ప్రసాద్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

నేడు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరపాలక సంస్థ సర్వసభ్య సాధారణ సమావేశం మంగళవారం ఉదయం 10.30 గంటలకు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు అధ్యక్షతన నిర్వహించనున్నట్టు కమిషనర్ ఎ.భాను ప్రతాప్ ఒక ప్రకటనలో తెలిపారు. అజెండాలో పొందుపర్చిన మొత్తం 16 అంశాలపై చర్చిస్తామని పేర్కొన్నారు.

వరుస చోరీలు.. జనం బెంబేలు

- తాళం వేసి ఉన్న ఇళ్లే లక్ష్యం
- చోరీలపై పోలీస్ కేసులతోనే సరి
- ఎల్‌హెచ్‌ఎంఎస్‌పై ప్రజల్లో అవగాహన నిల్



ఇటీవల స్వాధీనం చేసుకున్న చోరీ సొత్తుతో ఎస్పీ శివకిషోర్, డీఎస్పీ శ్రావణ్‌కుమార్ (ఫైల్)

ఏలూరు టౌన్: పోలీస్ ఏలూరు సబ్ డివిజన్‌లో చోరీల జోరు పెరిగింది. తాళం వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా చేసుకుని దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. ఇల్లు విడిచి ఊరెళ్లాలంటే భయపడాల్సి పరిస్థితి నెలకొంది. ఈ చోరీలను ఛేదించడం పోలీసులకు సవాల్‌గా మారింది. వరుస చోరీల నేపథ్యంలో ఇంటికి తాళం వేసి ఊర్లో క్రమంలో పోలీస్ నిఘాలో ఉండేలా తమ ఇంట్లో లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్)ను వినియోగించుకునేలా గతంలో మాదిరిగా పోలీసు అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

చోరీలు ఇలా..

- ఏలూరు శాంతినగర్ 4వ రోడ్డు ఆంధ్రాబ్యాంకు కాలనీలో నివాసం ఉంటున్న విద్యుత్ శాఖలో పనిచేసే రమేష్ ఇటీవల శబరిమల వెళ్లగా ఆయన భార్య ఇంటికి తాళాలు వేసి పిల్లలతో కలిసి కొవ్వూరు బంధువుల ఇంటికెళ్లింది. ఈ నేపథ్యంలో దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి 17 కాసుల బంగారు ఆభరణాలు, రూ.40 వేల నగదు చోరీ చేశారు.
- ఏలూరు శాంతినగర్‌కు చెందిన యర్రంశెట్టి సురేష్ తల్లి అనారోగ్యంతో ఉండడంతో ఆమెకు సాయంగా ఒక మహిళను పనికి పెట్టుకున్నారు. ఆమె ఇంట్లోని 322 గ్రాముల బంగారు ఆభరణాలను కాజేసింది. పోలీసులు కేసును ఛేదించి నిందితురాలిని అరెస్ట్ చేశారు.
- ఏలూరు వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన దళిత నేత నేతల రమేష్ తన భార్యతో కలిసి గత నెలలో గోపన్నపాలెం వెళ్లారు. రాత్రి వేళ తిరిగి వస్తుండగా ఏలూరు శివారు ప్రాంతంలో మోటారు సైకిల్‌పై వచ్చిన అగంతకులు రమేష్ భార్య మెడలోని బంగారు గొలుసు తెంపుకుపోయారు.
- ఏలూరు వన్‌టౌన్ పంపుల చెరువు ప్రాంతంలో రిటైర్డ్ ఎంఈఓ రామ్‌లాల్‌సింగ్ ఇంటిలో దొంగలు చోరీ చేశారు. రెండు రోజుల క్రితం ఆయన తన భవనంలోని కింది పోర్షన్‌కు తాళాలు వేసి పైకెళ్లి నిద్రపోయారు. ఉదయం లేచి చూసేసరికి తాళాలు పగులగొట్టి ఇంట్లోని 80 గ్రాముల బంగారు ఆభరణాలు, ఆర కిలో వెండి వస్తువులు చోరీకి గురయ్యాయి.
- ఏలూరు శివారు ఇంద్రప్రస్థ గేటెడ్ కమ్యూనిటీలో వారం రోజుల క్రితం ఒకే రోజు రెండిళ్లలో చోరీ జరిగింది. తాళాలను పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించిన దొంగలు బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు చోరీ చేశారు. ఇలా అనేక చోరీ కేసులు నిత్యం నమోదవుతునే ఉన్నాయని ప్రజలు వాపోతున్నారు.

సమాచారం ఇస్తే.. పోలీస్ నిఘా

ఎవరైనా ఊరెళితే.. సమీపంలోని పోలీసులకు సమాచారం ఇస్తే ఎల్‌హెచ్‌ఎంఎస్ ద్వారా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తారు. లేదా సంబంధిత ఇంట్లో సీసీ కెమెరాలు ఉంటే వాటిని పోలీస్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేస్తారు. ఎవరైనా అపరిచిత వ్యక్తులు సీసీ కెమెరాల ఎదురుగా వస్తే వెంటనే కంట్రోల్ రూమ్‌కు సమాచారం వెళుతుంది. దీనిపై ప్రజల్లో సరైన అవగాహన లేకపోవటంతో విలువైన బంగారు, వెండి ఆభరణాలు, నగదును కోల్పోతున్నారనే అభిప్రాయం ఏలూరు నగరంలో నెలకొంది. గతంలో మాదిరిగా ఎల్‌హెచ్‌ఎంఎస్‌పై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని పలువురు పోలీస్ అధికారులను కోరుతున్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో మేలు



రాత్రి వేళల్లో అపరిచిత వ్యక్తుల కదలికలు గమనిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ఊర్లో క్రమంలో ప్రజలు ఎల్‌హెచ్‌ఎంఎస్‌ను వినియోగించుకోవాలి. ప్రజలు ఇళ్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా సెల్‌ఫోన్‌లో సంబంధిత ఇంటి యజమానులు పర్యవేక్షణ చేసుకునే అవకాశం ఉంటుంది. చోరీ జరిగినప్పుడు నిందితులను పట్టుకునేందుకు ఆధారాలు లభ్యమౌతాయి.

– డి.శ్రావణ్‌కుమార్, డీఎస్పీ, ఏలూరు

చిన్నారులకు రక్త మార్పిడి



బాధిత చిన్నారిని పరామర్శిస్తున్న బీవీ కృష్ణారెడ్డి

ఏలూరు (టూటౌన్): ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్‌క్రాస్ తలసేమియా భవనంలో తొమ్మిది మంది తలసేమియా బాధిత చిన్నారులకు రక్త మార్పిడి చికిత్స అందిస్తున్నట్టు జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి తెలిపారు. రక్తదాతల సహకారంతో బాధత చిన్నారులకు 1000 నుంచి 1200 రక్త యూనిట్లను సరఫరా చేస్తున్నామని చెప్పారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఎన్‌వీపీఎస్ ప్రసాద్ సహకారంతో సోమవారం తలసేమియా చిన్నారులకు వారి తల్లిదండ్రులకు 25 మందికి మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వరప్రసాదరావు, రెడ్ క్రాస్ కార్యదర్శి కేబీ సీతారాం, డాక్టర్ జి.స్పందన, పీఆర్‌వో కేవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

26న మున్సిపల్ కార్మికుల ధర్నా



సమావేశంలో మాట్లాడుతున్న సోమయ్య

ఏలూరు (టూటౌన్): మున్సిపల్ ఉద్యోగుల, కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 26న రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఆఫీసులు, మస్టర్ పాయింట్ల వద్ద ధర్నా చేయనున్నట్టు ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.సోమయ్య తెలిపారు. స్థానిక పవరుపేటలోని సంఘ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఏలూరు నగరపాలక సంస్థ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నగర కమిటీ సమావేశంలో సోమయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. 12వ పీఆర్సీ ప్రకటించాలని, ఐఆర్ ఇవ్వాలని, 2023 జూలై నుంచి ఎరియర్స్ చెల్లించాలని, ఇంజినీరింగ్ కార్మికులకు సమాన వేతనాలు ఇవ్వాలని, సమ్మె కమిటీ సిఫార్సుల కనుగుణంగా స్కిల్డ్, సెమిస్కిల్డ్ జీతాలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. మున్సిపల్ స్కూల్ స్వీపర్లకు కనీస వేతనం 15,000 ఇవ్వాలని కోరారు. ఆప్కాస్ కార్మికులకు పెండింగ్ ఎక్స్‌గ్రేషియోలు చెల్లించాలని, రిటైర్మెంట్ వయసు 62 ఏళ్లకు పెంచాలని, గ్రాట్యుటీ చెల్లింపునకు ఉత్తర్వులు జారీ చేయాలని, సర్వీసులో ఉండగా చనిపోయిన వారి వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగర అధ్యక్షుడు లావేటి కృష్ణారావు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.జాన్ బాబు, వాటర్ వర్కర్స్ యూనియన్ నాయకులు వినుకొండ రమేష్, కె.సత్యనారాయణ, బి.ఆంజనేయులు, ప్రమోదు సోమేశ్వరరావు, రాజు, పారిశుద్ధ్య విభాగం నాయకులు బంగారు వెంకటేశ్వరరావు, పి.విష్ణు, కాళిదాసు, హనుమంతరావు, గోపి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

పీఎంపీల సేవలు అభినందనీయం



ఎమ్మెల్యే చంటికి వినతి పత్రం అందిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): గ్రామాల్లో పీఎంపీలు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. కమ్యూనిటీ పారామెడిక్స్ - ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పీఎంపీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) 62వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఆనందం సుబ్బారావు అధ్యక్షతన సోమవారం శ్రీ సీతారాంభర్తియా కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. పీఎంపీ జాతీయ, రాష్ట్ర నాయకులు వీబీటీ రాజు, తోరాటి ప్రభాకరరావు జ్యోతి ప్రజ్వలన చేశారు. ఎస్ఎంఆర్ గ్రూప్ చైర్మన్ పెదబాబు, ఏపీఎస్ ఆర్టీసీ జోన్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, డీసీసీబీ ఎక్స్ డైరెక్టర్ పుప్పాల శ్రీనివాస్, టీడీపీ నేత పుప్పాల హరీష్, సీఎస్ఆర్ గ్రూప్ చైర్మన్ చెరుకూరి నరేన్, పీఎంపీల నాయకులు ఎస్ వేణుగోపాల్, కె జనార్దన్, బళ్లా శ్రీనివాసరావు, పి.దేవానందంలు మాట్లాడారు. జిల్లా కార్యదర్శి ఎం జయరాం స్వాగతం పలికారు. శ్రీ కృష్ణ హాస్పిటల్ చైర్మన్ బి.కృష్ణ,శ్రీ కృష్ణ ఫెర్టిలిటీ సెంటర్ వైద్య నిపుణులు రోషిణి గుండెపనేని పలు వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఆర్కే పరమేశ్వరులు, ఎం జితేంద్ర, మురళి కృష్ణ, ఎన్ సుబ్బారావు తదితరులు హాజరయ్యారు.

ముగిసిన వినియోగదారుల వారోత్సవాలు



సదస్సులో మాట్లాడుతున్న సత్యనారాయణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : కాన్ఫెడరేషన్ ఆఫ్ ఏలూరు డిస్ట్రిక్ట్ కన్స్యూమర్స్ అసోసియేషన్ (సెడ్కాస్) ఆధ్వర్యంలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ వినియోగదారుల వారోత్సవాలు సోమవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమం స్థానిక ఆర్‌ఆర్‌పేటలోని శర్వాణి స్కూల్‌లో నిర్వహించారు. వినియోగదారుల హక్కులు బాధ్యతలపై, వినియోగదారుల చట్టం–2019పై ప్రధానోపాధ్యాయుడు మురళి అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సెడ్కాస్ కన్వీనర్ కట్టా సత్యనారాయణ, కో కన్వీనర్ సీవీఎస్ రామానుజాచార్యులు న్యాయవాదులు ఎం జోసఫ్, వై శిరీష, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

27న వాలీబాల్ రాష్ట్ర జట్టు ఎంపిక

ఏలూరు రూరల్ : జనవరి 7వ తేదీ నుంచి 13 వరకు రాజస్థాన్‌లోని జైపూర్‌లో జాతీయ సీనియర్ వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్టు ఏలూరు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి బి.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టు ఎంపిక పోటీలు ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 27న విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో నిర్వహించనున్నారని వివరించారు. సీనియర్ పురుషులు, మహిళలు నివాస ధ్రువీకరణ పత్రంతో పాటు 10 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో వాలీబాల్ కోర్టు వద్దకు హాజరుకావాలని సూచించారు.

క్రిస్మస్‌కు ముస్తాబు



ఏలూరు ఏఎస్ఆర్ స్టేడియం వద్ద ఉన్న ఐసీఎంసీ చర్చి



పురాతన సీఎస్ఐ చర్చి

క్రిస్మస్ పండుగకు సుందరంగా ముస్తాబయ్యాయి. డిజిటల్ లైట్లు అమర్చి చర్చిలను కొత్త హంగులతో తీర్చిదిద్దారు. స్టార్స్, బెలూన్స్, ఏసు జన్మ వృత్తాంతాన్ని తెలిపేలా పశువుల పాక సెట్టింగులను ఏర్పాటు చేశారు. ఏలూరు నగరంలోని విద్యుత్ కాంతుల్లో వెలిగిపోతున్న కొన్ని చర్చిలు ఇవి.

– సాక్షి ఫొటోగ్రాఫర్ / ఏలూరు



శాంతినగర్‌లోని మన్నా చర్చి



అమలోద్భవి చర్చి

తూనికలు, కొలతలపై అవగాహన అవసరం



సదస్సులో మాట్లాడుతున్న తూనికలు, కొలతల శాఖ అధికారి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): తూనికలు కొలతల శాఖ నిబంధనలు, చట్టాలపై వినియోగదారులు, వ్యాపారులు, అవగాహన కలిగి ఉండాలని తూనికలు, కొలతలు శాఖ ఉప నియంత్రకులు బీవీ హరిప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక కేపీడీటీ హైస్కూల్లో తూనికలు కొలతల వినియోగం, రైతు బజార్, చికెన్, మటన్, కిరాణా షాపులలో చేసే మోసాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. దీనిపై హరిప్రసాద్ మాట్లాడుతూ జాతీయ వినియోగదారుల వారోత్సవాల్లో భాగంగా ఈనెల 18 నుంచి 24వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. లీగల్ మెట్రాలజీ శాఖ అధికారులు తూనికలు కొలతలలో జరిగే మోసాలపై అవగాహన కలిగించారు. ఎలక్ట్రానిక్ కాటాలలో మోసాన్ని ఎలా గుర్తించాలో వివరించారు. బంగారం కొనుగోలు బిల్లులో బంగారం బరువు, రాళ్ల బరువు విడిగా ఉండేట్లు చూసుకోవాలన్నారు. పెట్రోల్ కొట్టించుకునేటప్పుడు మీటర్ రీడింగ్ విధిగా జీరో నుంచి మొదలవుతుందో లేదో చూసుకోవాలని, అనుమానం ఉంటే పెట్రోల్ పంప్ డీలర్ వద్ద ఉన్న ఐదు లీటర్ల కొలమానంపై సరి చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో తూనికలు కొలతల శాఖ సంయుక్త నియంత్రకులు సుధాకర్, సహాయ నియంత్రకులు సాయి రామ్, పరిశీలకులు ప్రశాంత్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హమాలీలను ప్రభుత్వాలు ఆదుకోవాలి



హమాలీ ముఠా కార్మిక సంఘం నూతన నాయకులు

ఏలూరు (టూటౌన్): హమాలీ కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ఐఎఫ్‌టీయూ ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యాలయంలో దూళ్ల వీరి నాయుడు అధ్యక్షతన నిర్వహించిన ఐఎఫ్‌టీయూ అనుబంధ ఏలూరు హమాలీ ముఠా కార్మిక సంఘం 32వ వార్షికోత్సవ సభను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా యర్రా శ్రీనివాసరావు మాట్లాడుతూ హమాలీలకు సౌకర్యాలతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయాలని, పూర్తిస్థాయి భద్రత కల్పించాలని, ఉచిత తోపుడు రిక్షాలు అందించాలని కోరారు. ఐఎఫ్‌టీయూ నగర కమిటీ నాయకులు ముంగము అప్పారావు, సందకం అప్పారావు, బుడితి వీర భద్రం, రంగాల నూకరాజు మాట్లాడారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఏర్పాటుచేశారు. కమిటీ అధ్యక్షుడిగా దూళ్ల వీరి నాయుడు, ఉపాధ్యక్షుడిగా బి.భూపతి, ప్రధాన కార్యదర్శిగా బద్దా వెంకట్రావు, కోశాధికారిగా ప్రసాదు, సభ్యులుగా రామ్మూర్తి నాయుడు, ధర్మ, సాయి,చిన్న, గోకర్ల లక్ష్మణ్, రాఘవ, బాపూజీ, నారాయణ ఎన్నికయ్యారు.

పోటీతత్వంతోనే ఉన్నతి

దెందులూరు: పోటీతత్వం నిరంతర సాధనతోనే ఉన్నతమైన భవిష్యత్తు లభిస్తుందని గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ నతానియేలు అన్నారు. సోమవారం వేగవరం హేలాపురి టెక్నాలజీ అండ్ సైన్స్ కాలేజీలో జేఎన్‌టీయూ పరిధిలోని కళాశాలల క్రికెట్ పోటీలు నిర్వహించారు. తొలుత హేలాపురి కళాశాల ప్రిన్సిపాల్ లావణ్య, ఏఓ కరుణానిధితో కలిసి నతానియేలు ఇంజినీరింగ్ కళాశాలలో క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఉదయం నిర్వహించిన మ్యాచ్‌లో రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాల జట్టు, ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల జట్టుపై విజయం సాధించింది. సాయంత్రం మ్యాచ్‌లో పీబీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల జట్టు, కైట్స్ ఇంజినీరింగ్ కళాశాల జట్టుపై విజయం సాధించింది. విజేత జట్లను ప్రిన్సిపాల్ నతానియేల్ అభినందించారు.

5న హైందవ శంఖారావం సభ



సమావేశంలో మాట్లాడుతున్న రాఘవులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): తిరుమల లడ్డూ వివాదం, ఆలయాలపై దాడుల ఘటనలు, హిందూ ఆలయాల నిర్వహణను హిందూ సమాజానికే అప్పగించాలనే డిమాండ్‌తో హైందవ శంఖారావం సభ నిర్వహించనున్నట్టు విశ్వహిందూ పరిషత్ జాతీయ కార్యదర్శి యక్కలి రాఘవులు అన్నారు. మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ నివాసంలో ఆర్యవైశ్య ప్రముఖులు, వ్యాపారులతో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జనవరి 5న నిర్వహించే హైందవ శంఖారావం సభను విజయవంతం చేయాలని కోరారు. విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు వబిలిశెట్టి శ్రీ వెంకటేశ్వర్లు, అంబిక కృష్ణ, హైందవ శంఖారావం జిల్లా కన్వీనర్ సూర్య ప్రకాష్, కో కన్వీనర్ మేడిశెట్టి పాములు, జిల్లా నిధి సేకరణ్ ప్రముఖ్ కృష్ణ ప్రసాద్, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు కాకి సురేష్ కుమార్ పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	28
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	35
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	17
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.45	4820	15
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.15	4822	30
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	20
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	17
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	21
ఏలూరు-బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	24
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	32
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	18
ఏలూరు - తిరుపతి	16.00	4830	25

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	24	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	36	చిక్కుడు కాయలు	50
వంకాయలు (కాంతులు)	54	బీన్సచిక్కుడు	80
వంకాయలు (తెలుపు)	52	చామదుంపలు	44
బెండకాయలు	36	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	24-32	కంద	60
కాకర కాయలు	34-44	బీట్‌రూట్	56
బీరకాయలు	30	కీరా దోస	44
బీరకాయలు (పందిరి)	44	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	30	అల్లం	70
క్యారెట్	40	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	50	పాలకూర	10
బంగాళదుంపలు	32-36	చుక్కకూర	10
ఉల్లిపాయలు	45	తోటకూర	10
గోరుచిక్కుడు	34	గోంగూర	07
దోసకాయలు	30	పుదీనా	05
ఆనబకాయ (1)	20-25	క్యాప్సికమ్	72
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	36